నమస్తే తెలంగాణ

నల్లగొండ, సోమవారం 2 సెప్టెంబర్ 2024
MONDAY, SEPTEMBER 2, 2024

# కన్నీరు మిగిల్చిన జడివాన

## భారీ వర్షంతో జిల్లా అతలాకుతలం

- దెబ్బతిన్న రోడ్లు.. నిలిచి పోయిన రాకపోకలు
- మునిగిన పంటలు.. ఇండ్లలోకి చేరిన నీళ్లు
- తెగిన విద్యుత్ తీగలు.. అంధకారంలో గ్రామాలు
- ఉప్పొంగిన చెరువులు.. అధికారుల సహాయక చర్యలు

***బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావానికి రెండ్రోజులుగా కురిసిన భారీ వర్షం కన్నీరే మిగిల్చింది. కొన్ని చోట్ల మోస్తరు, మరికొన్ని చోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి వాగులు, వంకలు, చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మరికొన్ని చోట్ల చెరువులకు గండి పడడంతో పంట పొలాలు నీట మునిగాయి. రోడ్లపైకి వరద చేరి రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ వైర్లు తెగి పలు గ్రామాలు అంధకారంలో ఉండిపోయాయి. అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూశారు.***



మఠంపల్లి : చెన్నాయిపాలెం బ్రిడ్జి తెగిపోవడంతో అలింగాపురం -పాలకవీడుకు నిలిచిపోయిన రాకపోకలు

## హుజూర్ సాగర్!

- భారీ వర్షానికి నీట మునిగిన హుజూర్‌నగర్ పట్టణం

నేరేడుచర్ల, సెప్టెంబర్ 1 : హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఇదే పరిస్థితి. హుజూర్‌నగర్ పట్టణంలోని కోదాడ, మఠంపల్లి రోడ్డుతో పాటు గోవిందాపురం, సుందరయ్య నగర్‌లో కాలనీల్లోకి వరద చేరి రోడ్లన్నీ జలమయమయ్యాయి. మఠంపల్లి రోడ్డులో ప్రవహిస్తున్న వరదలో లారీ దిగబడగా ఒక ఆటో కొట్టుకపోతుండగా అధికారులు స్పందించి జేసీబీ సాయంతో కాపాడారు. హుజూర్‌నగర్ పీఏపీస్ గోదాంలోకి వరద చేరి యూరియా, అడుగుమందు, పోటాషియం కొద్దిమేర తడిసింది. మేళ్లచెర్వు మండలంలోని నాగుల చెరువు, ఊర చెరువుకు గండిపడడంతో చుట్టుపక్కల పొలాలు నీట మునిగాయి. చింతలపాలెం మంలంలోని దొండపహాడ్ గ్రామంలోని ఎర్ర వాగు ఉధృతంగా ప్రవహించడంతో పొలాలు నీట మునిగాయి. పులిచింతల నుంచి పెద్ద ఎత్తున నీరు విడుదలవుతుండడంతో పొలాలు నీట మునిగాయి. పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ -కల్మెట్ తండా రహదారిలోని లోలెవల్ వంతెనపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. రాఘవాపురం వద్ద ఉన్న గాయత్రి పవర్‌ప్లాంట్‌లోకి వరద చేరడంతో ఆరుగురు సిబ్బంది వరదలో చిక్కుకు పోగా అధికారులు స్పందించి బయటకు తీసుకొచ్చారు. కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాగిపహాడ్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయి. మఠంపల్లి మండలంలోని బక్కమంతుల గూడెం, చౌటపల్లి, మఠంపల్లిలోని చెరువులకు గండి పడి సుమారు వెయ్యి ఏకరాలు నీట మునిగింది. మఠంపల్లి నుంచి పాలకవీడు మండలంలోని అలింగాపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో చెన్నాయిపాలెం వద్ద వంతెన కూలి రాకపోకలు నిలిచిపోయాయి. పులిచింతల బ్యాక్ వాటర్ పెరిగి మట్టపల్లి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలోకి వరద చేరింది. ఎస్సీ కాలనీలోని పలు గృహాల్లోకి వరద చేరింది. నేరేడుచర్ల మండలంలో శనివారం అర్ధరాత్రి వరకు భారీ వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారు జామునే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ఫత్తేపురం రోడ్డులో చెట్టు పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడగా అధికారులు చక్కదిద్దారు. రామాపురం వాగు ఉధృతంగా ప్రవహించడంతో పొలాలు నీట మునిగిపోయాయి. జానల్‌దిన్న రోడ్డు, రాజీవ్‌నగర్ పరిధిలో, జాన్‌పహాడ్ రోడ్డు, పాత నేరేడుచర్లలోని పలు ప్రాంతాల్లో వీధులు జలమయమయ్యాయి. జాన్‌పహాడ్ రోడ్డులో గల హెచ్‌పీ బంకు వద్ద కల్వర్టు మీది నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులయ్యా యి. తెలగరామయ్యగూడెం గ్రామం వద్ద వా గు ఉధృతికి రోడ్డుపై నుంచి వరద పారుతోం ది. మేడారం గ్రామంలో విద్యుత్ స్తంభం కూలి ఓ ఇంటి మీద పడడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేసి సహాయక చర్యలు చేపట్టారు. ఏయిర్‌టెల్, ఐడీయా టవర్లు దెబ్బ తిని సిగ్నల్స్ రాలేదు. మూసీ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పరివాహక ప్రజలను అప్రమత్తం చేశారు.



కోదాడ రూరల్ : వర్షానికి ధ్వంసమైన కాపుగల్లు-కూచిపూడి ప్రధాన రహదారి



అర్వపల్లిలో ఇంట్లోకి చేరిన వరద

## నేడు మంత్రి ఉత్తమ్ పర్యటన

కోదాడటౌన్ : కోదాడ పట్టణంలోని ముంపు ప్రాంతాలను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం ఉదయం 8 గంటలకు సందర్శించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీలరమేశ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమాదేవితో కలిసి ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. టీటీడీ కల్యాణ మండపం, గుడుగుంట్ల అప్పయ్య పంక్షన్‌హాల్, బాలుర ఉన్నత పాఠశాల సీసీరెడ్డి పాఠశాలలో పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. ఆహారంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ తేజస్ నందలాల్

సూర్యాపేట : మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. వర్ష ప్రభావిత ప్రాంతాలైన కోదాడ, హుజూర్‌నగర్, మఠంపల్లి, సూర్యాపేట, ఖమ్మం సరిహద్దు ప్రాంతాలను ఆదివారం ఆయన పరిశీలించారు. వర్షాల వల్ల ఎలాంటి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మండల, డివిజన్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. వంతెనల వద్ద నీరు పారే సమయంలో ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు 6281492368 నంబర్‌తో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైతేనే ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలని సూచించారు.

- హుజూర్‌నగర్/మఠంపల్లి : హుజూర్‌నగర్ పట్టణంలో వర్షాభావం వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదివారం పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ యాకూబ్‌పాష, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు. మఠంపల్లి మండలంలోని బక్కమంతులగూడెం, చౌటపల్లి, మఠంపల్లి చెరువులు తెగిపోయి పంట నీట మునగడంతో కలెక్టర్ పరిశీలించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ఓ ఇంటిలోకి నీరు చేరడంతో తాసీల్దార్ మంగా రాథోడ్ ఇల్లు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతానికి పంపారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న సుమారు 400 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా వరంగల్ జిల్లా కేసముద్రం వద్ద రైల్వేట్రాక్ దెబ్బతినడంతో గుంటూరు వెళ్లే పలు రైళ్లు నడికుడి మఠంపల్లి మండల మీదుగా గుంటూరు మళ్లించారు.



మఠంపల్లి : తీగల చెరువు కట్ట తెగిపోవడంతో పరిశీలిస్తున్న కలెక్టర్ నందలాల్ పవార్

### ప్రయాణం వాయిదా వేసుకోవాలి : ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

బొడ్రాయిబజార్ : భారీ వర్షాలతో ఆంధ్రాలో చిల్లకల్లు, నందిగామ వద్ద జాతీయ రహదారి 65పై నీళ్లు ప్రవహిస్తున్నాయని, అలాగే సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్లే మార్గంలో నాయకన్‌గూడెం వద్ద రోడ్డుపై పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నదని సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ మార్గంలో వాహనాలు నిలిపివేశామని, విజయవాడ, ఖమ్మం వెళ్లే వారు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ఆయన తెలిపారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, జిల్లా స్పెషల్ బ్రాంచి కంట్రోల్ రూమ్ 8712686026కు ఫోన్ చేయాలని చెప్పారు.

### ప్రమాదకర స్థితిలో కందిబండ వంతెన

మేళ్లచెర్వు : మండల పరిధిలోని కందిబండ గ్రామంలోని ఊరచెరువు సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న వంతెన వర్షాలకు బీటలు బారి ప్రమాదకరంగా మారింది. పోలీసులు భారీ వాహనాలను వంతెనపై నుంచి వెళ్లకుండా ఆపివేశారు.



కోతకు గురైన వంతెన



మఠంపల్లి మండల కేంద్రంలో నీట మునిగిన పంట



పాలకవీడు : జాన్‌పహాడ్‌దర్గా-కల్మటితండా చింత వాగు ప్రమాదకరంగా పొంగుతుండడంతో నిలిచిన రాకపోకలు



నేరేడుచర్ల : గంటవారిగూడెం వద్ద రోడ్డుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



నేరేడుచర్ల : మేడారం గ్రామంలో ఇండ్లపై కూలిన విద్యుత్ స్తంభం



మేళ్లచెర్వు : కోతకు గురైన మేళ్లచెర్వు-ఎర్రగట్టుతండా రోడ్డు



పాలకవీడు మండలం రాఘవాపురం - గుండ్లపహాడ్ గ్రామాల మధ్య వంతెనపై వరద ప్రవాహం



సూర్యాపేట రూరల్ : అలుగు పోస్తున్న ఎర్కారం చెరువు



ఆత్మకూర్ ఎస్ : ఏపూరు వద్ద బిక్కేరు వాగు బ్రిడ్జిపై నుంచి పారుతున్న వరద

## జిల్లాకేంద్రం.. జలమయం

సూర్యాపేట/సూర్యాపేట రూరల్/బొడ్రాయి బజార్ : సూర్యాపేట పట్టణంలో కుంభవృష్టితో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. జిల్లా కేంద్రంలో శనివారం 19 సెంటీమీటర్లు, చివ్వెంల 13, ఆత్మకూర్(ఎస్) 16, పెన్‌పహాడ్ 12 సెంటీమీటర్ల వర్షం పడింది. జిల్లా కేంద్రంలోని సద్దల చెరువు, పుల్లారెడ్డి చెరువు, నల్లచెరువు పూర్తిగా నిండి అలుగు పోస్తున్నాయి. 18వ వార్డు సుందరయ్యనగర్‌లో ఇంటి గోడ కూలి నలుగురికి గాయాలయ్యాయి. మూసీ నది గేట్లు తెరువడంతో భీమారం- మిర్యాలగూడెం రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. పిన్నాయిపాలెం వద్ద మూసీ కాల్వకు గండి పడడంతో అధికారులు వెంటనే మరమ్మతులు చేయించారు. పెన్‌పహాడ్ మండలంలో అనంతారం గ్రామానికి చెందిన మామిడి వెంకటేశ్వర్లు ఇల్లు కూలింది. ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ చెరువు అలుగు పోయడంతో దంతాలపల్లి-సూర్యాపేట రహదారిపై రాకపోకలు నిలిచాయి.

### ప్రజావాణి రద్దు

వర్షాల కారణంగా పలుచోట్ల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి ఈనెల 9న జరిగే ప్రజావాణికి హాజరుకావాలని కోరారు.



సూర్యాపేటలో అలుగుపోస్తున్న సద్దుల చెరువు



అర్వపల్లిలో జలదిగ్బంధంలో కేజీబీవీ పాఠశాల



సూర్యాపేటలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఏసీ బీఎస్ లత



అర్వపల్లి : జడ్పీహెచ్‌ఎస్‌లోకి చేరిన వరద



మద్దిరాలలో భారీ చేపతో యువకుడు



పాలకవీడు : జాన్‌పహాడ్‌లో పొలంలో దొరికిన చేపతో రైతు



సూర్యాపేట తాసీల్దార్ కార్యాలయంలో నేలకూలిన భారీ వృక్షం



సూర్యాపేట రూరల్ : కాసరబాదలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



మోతె : అలుగు పోస్తున్న సిరికొండ నాగుల చెరువు

## కోదాడ పట్టణం.. అస్తవ్యస్తం

- రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపిన ప్రజలు
- వరద ఉధృతికి ఇద్దరు మృతి
- బాధితులకు మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ పరామర్శ

కోదాడ/కోదాడ రూరల్, సెప్టెంబర్ 1 : కోదాడ, చిలుకూరులో 135 మిల్లీమీటర్ల వర్షం కురువడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చిలుకూరు, కోదాడ, అనంతగిరి, మునగాల రహదారులు తెగిపోవడంతో వేల ఎకరాలు నీట మునిగాయి. నడిగూడెం మండలంలో సాగర్ కాల్వకు గండి పడడంతో పంట పొలాలన్నీ నీట మునిగాయి. కాగితరామచంద్రాపురం గ్రామంలోని ఇండ్లలోకి నీళ్లు చేరాయి. చిలుకూరు మండలంలోని పాలెం చెరువుకు గండి పడి పంటలకు నష్టం వాటిల్లింది. అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామంలోని ఇండ్లలోకి వరద చేరింది. కోదాడ పట్టణంలోని లోతట్టు కాలనీలు జలదిగ్బంధమయ్యాయి. షిరిడీ సాయినగర్, ఎంఎస్ కళాశాల వెనుక బాగం, భవానీ నగర్, మాతానగర్ హరిజనవాడ, శ్రీరంగాపురం, శ్రీమన్నారాయణ కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. రంగా థియేటర్ చౌరస్తా, హుజూర్‌నగర్ రోడ్డులోని పెట్రోల్ బంక్ ప్రాంతం, ఎస్ఆర్ స్కూల్ వద్ద వరద ప్రవాహం ఎక్కువ కావడంతో మురళీకృష్ణ దాబా నుంచి కారులో వస్తున్న రవి అనే యువకుడు, ఉత్తమ్ పద్మావతి నగర్ నుంచి బైక్‌పై వస్తున్న ఎరామాల వెంకటేశ్వర్లు వాగులో కొట్టుకు పోయి మృతి చెందారు. ముంపు కాలనీలను కలెక్టర్ పరిశీలించారు. నీట మునిగిన కాలనీలను మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ఆయన వెంట టీఆర్ఎస్ నాయకులు చింతల లింగయ్య, మాదాసు ఉపేందర్, అభి, అబూబకర్, మాజీ సర్పంచ్ వెంకటరత్నం బాబు ఉన్నారు.



కోదాడ : నీట మునిగిన షిరిడీ సాయినగర్ వాసులను జేసీబీ సాయంతో సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

### నడిగూడెంలో సాగర్ ఎడమ కాల్వకు గండి

కోదాడ : నడిగూడెం మండల పరిధిలోని కాగితపు రామచంద్రాపురం శివారులోని సాగర్ ఎడమ కాల్వకు 40 మీటర్ల మేర గండి పడింది. దీంతో మండలంలోని కాగితపు రామచంద్రాపురం కరివిరాల, వాయిలసింగారం తదితర గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. అలాగే ఖమ్మం జిల్లా కూసుమంచి మండల నాయక్ గూడెం వద్ద మరో గండి పడింది. సంబంధిత అధికారులు సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ నష్టం వాటిల్లిందని రైతులు ఆరోపిస్తున్నారు.



తిరుమలగిరి : వినాయక తయారీ మండపంలోకి చేరిన వరద



తిరుమలగిరి రహదారిపై నీళ్లు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్న అధికారులు



తిరుమలగిరి జాతీయ రహదారిపై నిలిచిన వరద

## తిరుమలగిరిలో పోటెత్తిన వరద

తిరుమలగిరి : పట్టణంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి పలు కాలనీలు నీట మునిగాయి. 5వ వార్డులోని తిరుమలహిల్స్ నుంచి మాలిపురం పద్మశాలి కాలనీ వెళ్లే వీధిలో వరద రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తిరుమలగిరి - సూర్యాపేట జాతీయ రహదారిపై వరద చేరి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అధికారులు జాతీయ రహదారి డ్రైనేజీ లోకి నీళ్లు వెళ్లే విధంగా జేసీబీతో పూడిక తీయించడంతో రాకపోకలు సాగాయి. మాలీపురం చెరువు అలుగు పోయగా మండల పరిధిలోని పలు చెరువులు కుంటలు పొర్లుతున్నాయి.

### పునరావాస కేంద్రాలకు తరలింపు

మండలంలోని సిద్ది సముద్రం తండాలో పైకప్పు నుంచి నీరు కురిసి ఇండ్లలోకి నీరు చేరింది. దీంతో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా 8 కుటుంబాలను స్థానిక ప్రభుత్వ పాఠశాలకు తరలించి పండ్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీఓ బీమ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

### నీటమునిగిన కేజీబీవీ, జడ్పీహెచ్ఎస్

అర్వపల్లి : ఎన్‌హెచ్-365, జనగాం-సూర్యాపేట జాతీయ రహదారిపై వరద ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక కేజీబీవీ, జడ్పీహెచ్ఎస్‌లోకి వరద చేరింది. కేజీబీవీ నలుదిక్కులా నీరు చేరడంతో అందులో చిక్కుకున్న విద్యార్థినులను అధికారులు ఓ ఫంక్షన్ హాల్‌కు తరలించారు. తరువాత తల్లిదండ్రులు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు. జాజిరెడ్డిగూడెం బ్రిడ్జి వద్ద మూసీ పరవళ్లు తొక్కుతున్నది.